సాక్షి రంగారెడ్డి

బుధవారం। 14। ఆగస్టు। 2024



ఉలిక్కిపడిన నక్కర్తమేడిపల్లి

గ్యాంగ్‌స్టర్‌ను హత్య చేసిన నిందితులు తల దాచుకున్నారనే విషయం తెలియడంతో నక్కర్తమేడిపల్లి ఉలిక్కిపడింది. 8లో▸



తొలిదశలో గుర్తిస్తే..

కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. 8లో▸



డేంజర్ స్పీడ్!

'స్పీడ్ థ్రిల్స్ బట్ కిల్స్' ఇది ముమ్మాటికీ నిజమని ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు స్పష్టం చేస్తున్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

డాక్టర్ రాంచందర్‌కు అరుదైన గౌరవం



ధ్రువపత్రం అందుకుంటున్న డాక్టర్ రాంచందర్

బడంగ్‌పేట్: తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో (టీఏఎస్) ఫెలోగా బడంగ్‌పేటకు చెందిన డాక్టర్ రాంచందర్ ఎంపికయ్యారు. ఆయన భువనేశ్వర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ (ఐఎల్ఎస్)లో సీనియర్ సైంటిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రాంచందర్ సేవలను గుర్తించి ఉప్పల్‌లో జరిగిన సైంటిస్టుల ఉన్నత స్థాయి సమావేశంలో టీఏఎస్‌లో ఫెలోగా అవకాశం కల్పించారు. ఈ మేరకు ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ కుమార్ చేతుల మీదుగా ఆయన ధ్రువపత్రం అందుకున్నారు. భారతదేశ ప్రజల్లో వినికిడి లోపానికి కారణమైన జన్యుపరమైన విషయాలు అర్థం చేసుకుని తిరిగి వాటిని సవరించేందుకు చేస్తున్న పరిశోధనలకు గాను, అలాగే అరుదైన రుగ్మతలకు కారణమైన జన్యుశాస్త్ర రంగంలో రాంచందర్ సాధించిన విజయాలకు గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. డాక్టర్ రాంచందర్ వివిధ అంశాలపై 70కి పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించాలని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను అందించేందుకు 99592 26287నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'హర్ ఘర్ తిరంగా'ను విజయవంతం చేయాలి



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు జాతీయ జెండాను అందిస్తున్న పోస్టల్ అధికారులు

చేవెళ్ల: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయనకు సికింద్రాబాద్ డివిజన్ పోస్టల్ అధికారులు జాతీయ జెండాను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొనాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై ఆగస్టు 15లోగా జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. పోస్టల్‌శాఖ అందిస్తున్న బ్యాంకింగ్ బీమా, టర్మ్ పాలసీలు, చిన్న మొత్తాల పొదుపు వంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఎంఎ బీరయ్య, చేవెళ్ల పోస్ట్ మాస్టర్ నరేశ్ తదితరులు ఉన్నారు.


చిన్నారి మృతిపై వైద్యాధికారుల ఆరా



చిల్డ్రన్స్ ఆస్పత్రిలో విచారిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు తదితరులు

ఇబ్రహీంపట్నం: చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందిన ఘటనపై జిల్లా వైద్యాధికారులు ఆరా తీశారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నంలోని రవికృష్ణ చిల్డ్రన్స్ ఆస్పత్రిలో మంగళవారం విచారించారు. రాయపోల్ గ్రామానికి చెందిన ప్రజ్వల్ (8 నెలలు) అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరడం.. ఆలస్యంగా స్పందించిన వైద్యులు పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి రిఫర్ చేయడం.. మార్గమధ్యలో చిన్నారి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధామాధవితో కూడిన వైద్య బృందం స్థానిక మంచాల రోడ్డులోని చిల్డ్రన్స్ ఆస్పత్రికి తరలివచ్చి ప్రజ్వల్‌కు అందించిన వైద్యం తీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి అనుమతులు, వైద్యుల వివరాలు పరిశీలించారు. రెండు రోజుల్లో ప్రజ్వల్ మృతిపై సమగ్ర విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

వీరు తీరు మారలేదు!



అడ్డదారులు తొక్కుతున్న పలువురు అధికారులు

- తరచూ వెలుగు చూస్తున్న ఘటనలు
- ఏసీబీ కేసులకు వెరవని లంచగొండులు
- తాజాగా చర్చనీయాంశమైన అదనపు కలెక్టర్ ఉదంతం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా ఉంటూ.. ఉత్తమ సేవలందిస్తూ.. ఆదర్శంగా నిలవాల్సిన అధికారులు కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. దొరికిన చోటల్లా చేయి చాపుతూ అడ్డంగా దొరికిపోతున్నారు. అవినీతి నిరోధకశాఖ తరచూ దాడులు చేస్తున్నా.. అక్రమార్కులు వెరవడం లేదు. సరికదా.. ఎప్పటికప్పుడు సరికొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. ఏసీబీ వలకు చిరుద్యోగులే కాదు.. జిల్లా ఉన్నతాధికారులు సైతం చిక్కుకుంటుండటం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇక్కడ జేసీగా పని చేసిన జగన్మోహన్‌రావు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జైలుకు వెళ్లగా, తాజాగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎంవీ భూపాల్‌రెడ్డి సహా సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ రెడ్డి ఏసీబీకి చిక్కారు.

మచ్చుకు కొన్ని..

- నాలుగేళ్ల క్రితం కేశంపేట తహసీల్దార్ లావణ్య సహా అప్పటి వీఆర్‌ఓ అనంతయ్య ఏసీబీకి పట్టుబడ్డారు. రెవెన్యూ రికార్డులో పేరు మార్పిడి కోసం రూ.9 లక్షలు డిమాండ్ చేసి, రూ.4 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ పట్టుకుంది. తనిఖీల్లో భాగంగా ఆమె ఇంటి నుంచి రూ.93 లక్షల నగదు, భారీగా బంగారు ఆభరణాలు పట్టుబడటం అప్పట్లో సంచలనంగా మారింది.
- ఏడాది క్రితం కందుకూరు ఎంపీఓ కళ్యాణి, పంచాయతీ కార్యదర్శి నరేందర్ కూడా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- సరిగ్గా నెలన్నర క్రితం జిల్లా నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బన్సీలాల్, అసిస్టెంట్ ఇంజనీర్ కె.కార్తీక్, ఎస్ఈ ఆఫీసులోని ఏడబ్ల్యూ సెక్షన్ ఏఈ హెచ్.నిఖేష్‌కుమార్, గండిపేట మండల సర్వేయర్ పి.గణేశ్ ఏసీబీకి చిక్కారు. వీరు బఫర్‌జోన్లలో నిర్మాణాలకు నిరభ్యంతర పత్రం జారీ చేసే విషయంలో నెక్నంపూర్‌కు చెందిన బొమ్మ నరేందర్‌రెడ్డి నుంచి రూ.2.50 లక్షలు డిమాండ్ చేసి, మే 31న ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు బడ్డారు.
- గొర్రెల పంపిణీ పథకం స్కాంతో సంబంధం ఉన్న జిల్లాకు చెందిన అప్పటి పశు సంవర్ధకశాఖ అధికారి అంజలప్ప, అప్పటి భూగర్భ జలవనరులశాఖ అధికారి రఘుపతి రెడ్డిని ఇటీవల ఏసీబీ అరెస్టు చేసింది.
- తుర్కయంజాల్‌కు చెందిన ఓ వీఆర్‌ఓ, మున్సిపాలిటీ పరిధిలోని మరో బిల్ కలెక్టర్ కూడా ఏసీబీకి పట్టుబడ్డారు.
- నాలుగేళ్ల క్రితం షాద్‌నగర్ మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్ శేఖర్‌రెడ్డి ఏసీబీకి దొరికారు.
- ఆరు నెలల క్రితం శంషాబాద్ మండలం నర్కూడ పంచాయతీ కార్యదర్శి, కారోబార్ సహా ననాజీపూర్ పంచాయతీ కార్యదర్శి సహా కారోబార్ ఏసీబీకి చిక్కారు.

ఇటీవల పలువురిపై వేటు

శంషాబాద్‌లోని సర్వే నంబర్ 724,725లో 214.02 ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించింది. ఈ భూములకు సంబంధించిన పహాణీలను ట్యాంపర్ చేసి, అక్రమార్కులకు సహకరించిన అప్పటి రికార్డు అసిస్టెంట్ ప్రస్తుత అబ్దుల్లాపూర్‌మెట్ డీటీ రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ అజయ్, వీఆర్‌ఏ రవిని ఇటీవల కలెక్టర్ సస్పెండ్ చేశారు. ప్రస్తుత తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లకు సైతం సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తిపై అవినీతి ఆరోపణలు రావడం, విచారణలో ఇదే అంశం స్పష్టం కావడంతో ఇటీవల ఆమెను సస్పెండ్ చేశారు. తాజాగా బాటసింగారం, తారామతిపేట్ పంచాయతీ కార్యదర్శులపై వేటు వేశారు.

ధరణి వేదికగా..

- గత ఏడాది అక్టోబర్ 14 నుంచి నవంబర్ 19 వరకు నిషేధిత జాబితాలో ఉన్న వివాదాస్పద 98 దరఖాస్తులు తన ప్రమేయం లేకుండా ఆమోదం పొందాయని పేర్కొంటూ అప్పటి కలెక్టర్ భారతి హొళికేరి ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ధరణి పోర్టల్‌లో పని చేస్తున్న ఆపరేటర్లు నరేష్, మహేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి వదిలేశారు. ఇదే అంశంపై కలెక్టర్ భారతి హొళికేరిని ప్రభుత్వం ఇక్కడి నుంచి బదిలీ చేసి, ఆ తర్వాత ఈ అంశాన్ని పక్కకుపెట్టింది.
- గచ్చిబౌలి సర్వే నంబర్ 46లో రూ.300 కోట్ల విలువ చేసే మూడు ఎకరాల సీలింగ్ భూమిని సెప్టెంబర్ 23న ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం, గండిపేట మండలం పొక్కల్‌వాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 4లోని రూ.500 కోట్ల విలువ చేసే ఐదెకరాల భూమి సహా గంధంగూడ సర్వే నంబర్ 51లోని రూ. 250 కోట్ల విలువ చేసే 9.36 ఎకరాలకు 2023 మే 18న రియల్టర్లకు ధారాదత్తం చేసి, ఏకంగా పాసు పుస్తకాలు జారీ చేసిన అప్పటి కలెక్టర్లపై ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ)లో కేసులు నమోదై, విచారణ కొనసాగుతుతోంది.



తమ భూములను ఎవరూ ఆక్రమించలేదని చెబుతున్న రైతులు

కంపెనీ ప్రతిష్ట దెబ్బతీయొద్దు

- అసైన్‌మెంట్ భూమిని తీసుకోలేదు
- జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: తమ కంపెనీకి చెందిన 215 ఎకరాల్లో గజం అసైన్డ్ భూమి కూడా లేదని జీనియస్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇబ్రహీంపట్నం అనాజ్‌పూర్ సర్వే నంబర్ 276 నుంచి 281 వరకు 175 ఎకరాలు, అలాగే సర్వే నంబర్లు 261, 271 నుంచి 274లో మరో 40 ఎకరాల పట్టా భూములున్నాయని, వీటి ని డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్, ఆయన కుటుంబ సభ్యుల నుంచి కొనుగోలు చేశామని తెలిపింది. నాగన్‌పల్లి గ్రామంలోని 189 సర్వే నంబర్, అనాజ్‌పూర్ 281 సర్వే నంబర్లలో కొంత అసైన్‌మెంట్ భూములున్నాయని పేర్కొంది. వీటిలోకి వెళ్లేందుకు రైతులకు దారిలేకపోవడంతో, తమ భూము ల్లో కొంత ప్రభుత్వానికి సరెండర్ చేసి రోడ్డు వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపింది. రైతులతో కలిసి తమ కంపెనీ కూడా రోడ్డు వేసేందుకు సహకరిస్తోందని పేర్కొంది. తాము అసైన్‌మెంట్ భూమిని తీసుకోలేదని, అలాంటి ఆలోచన కూడా లేదని, కంపెనీ ప్రతిష్టను దెబ్బతీయొద్దని కోరింది.

మా భూములను ఎవరూ ఆక్రమించలేదు

ఇదిలా ఉండగా తమ భూములను ఎవరూ ఆక్రమించలేదని, తామెవరికీ అమ్ముకోలేదని, లీజుకు ఇవ్వలేదని నాగన్‌పల్లికి చెందిన పలువురు రైతులు స్పష్టం చేశారు. నాగన్‌పల్లిలోని సర్వేనంబర్ 189, అనాజ్‌పూర్‌లోని సర్వే నంబర్ 281లోని తమ భూముల్లోకి వెళ్లడానికి దారి లేకపోవడంతో రోడ్డు వేసుకోవడానికి సహకరించాలని తామే జీనియస్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీని కోరినట్టు తెలిపారు.

న్యాయ విచారణ చేపట్టాలి



సునీతను విచారిస్తున్న పౌరహక్కుల సంఘం నాయకులు

- సునీత ఘటనకు బాధ్యులైన పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

షాద్‌నగర్ రూరల్: దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పోలీసుల దాడిలో గాయపడిన సునీత ప్రస్తుతం తమ తల్లిగారి ఊరైన కేశంపేట మండలం పాపిరెడ్డిగూడలో ఉంటోంది. ఈ మేరకు మంగళవారం పౌరహక్కుల సంఘం రాష్ట్ర కమిటీతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ నాయకులు పాపిరెడ్డిగూడకు చేరుకున్నారు. సునీతతో పాటు ఆమె భర్త భీమయ్య, కుమారుడు జగదీశ్వర్, ఇరుగు పొరుగు వారిని కలిసి నిజనిర్ధారణ చేపట్టారు. అనంతరం పట్టణంలోని దేవిగ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. షాద్‌నగర్‌లోని హరిజనవాడకు చెందిన నాగేందర్ ఇంట్లో గత నెల 24న బంగారం చోరీ జరిగిందని, బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారని తెలిపారు. దర్యాప్తులో భాగంగా నాగేందర్ కుటుంబ సభ్యులతో పాటు ఇంటి సమీపంలో ఉన్న భీమయ్య, భార్య సునీతను తీసుకెళ్లి విచారించి వదిలేశారన్నారు. జూలై 30న సునీత ఇంటి ముందు బంగారంతో కూడిన పార్సిల్ కవర్ కనిపించడంతో సునీతనే ఆ బంగారం దొంగిలించిందనే నేపంతో పోలీసులు ఆమెను పీఎస్‌కు పిలిపించి విపరీతంగా కొట్టారని, నేరం ఒప్పుకోకపోవడంతో భర్త భీమయ్య,కుమారుడు జగదీశ్వర్‌ను తీసుకువెళ్లి చిత్రహింసలకు గురి చేశారని వెల్లడించారు. మహిళను రాత్రి 6 గంటల తరువాత స్టేషన్‌కు తీసుకువెళ్లే అధికారం పోలీసులకు ఏ చట్టం ఇచ్చిందని, ఒక మహిళను అర్ధరాత్రి రెండు గంటల వరకు చిత్రహింసలకు గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఘటనలో ఉన్నతాధికారులు కంటి తుడుపు చర్యగా ఆరుగురు పోలీసులును సస్పెండ్ చేసి కేసును దృష్టి మళ్లించారని ఆరోపించారు. ఈ ఘటనకు కారణమైన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, ఆమె భర్తకు ఉద్యోగం ఇవ్వాలని, కుటుంబానికి పక్కా ఇల్లు కట్టించాలని, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు,ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు సుభాన్, ప్రధాన కార్యదర్శి జక్కబాలయ్య, సహాయ కార్యదర్శి కలకొండ రాములు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కంప్యూటర్ ద్వారా నేర్చుకున్న అంశాలను అడిషనల్ డైరెక్టర్‌కి వివరిస్తున్న విద్యార్థి

కార్పొరేట్‌కు దీటుగా బోధన

- తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి

మహేశ్వరం: ప్రభుత్వ మోడల్ స్కూళ్లలో కార్పొరేటుకు దీటుగా విద్యాబోధన ఉంటుందని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ని మంగళవారం ఆయన సందర్శించారు. స్కూల్‌లో ఉన్న సైన్స్, కంప్యూటర్, బోటనీ, జువాలజీ ల్యాబ్స్, డిజిటల్ ల్యాబ్, గ్రంథాలయాన్ని పరిశీలించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ మోడల్ స్కూళ్లలో అనుభవంతో కూడిన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని తెలిపారు. విశాలమైన తరగతి గదులు, మైదానంతో పాటు, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్టు చెప్పారు. మహేశ్వరం మోడల్ స్కూల్ ఇతర మోడల్ స్కూళ్లకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. స్కూల్‌కి చెందిన ఇద్దరు విద్యార్థులు ఇటీవల ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కాట్రావత్ శివ, ముడావత్ సిద్ధుతో పాటు ప్రిన్సిపాల్, అధ్యాపకులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో అకాడమీ మానిటరింగ్ అధికారి మంజరి, మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్, ఉపాధ్యాయులు నాగకళ, రెహానా, మాధవి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలు

సైబరాబాద్ సీపీ ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: ర్యాగింగ్ భూతాన్ని తుదముట్టించేందుకు సైబరాబాద్ పోలీసులు నడుం కట్టారు. విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నిరోధక చర్యలకు ఉపక్రమించారు. ప్రిన్సిపాల్స్, ప్రొఫెసర్లు, వార్డెన్లు, తల్లిదండ్రులు, విద్యార్థులతో కూడిన 'యాంటీ ర్యాగింగ్ కమిటీ'లను ఏర్పాటు చేయాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులతో సమన్వయంగా ఈ కమిటీలు పని చేయాలని సూచించారు. విద్యా సంస్థల లోపల, చుట్టుపక్కల ప్రదేశాలలో ర్యాగింగ్ నిరోధక చట్టాలను హైలెట్ చేస్తూ పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. ర్యాగింగ్ నిషేధ చట్టం- 1997లోని సెక్షన్- 4 ప్రకారం ర్యాగింగ్‌కు పాల్పడితే ఆరు నెలల నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశముంది. ర్యాగింగ్ చేసి దోషిగా తేలిన వారిని విద్యాసంస్థ నుంచి తొలగిస్తారు. ఆరు నెలలు దాటి జైలు శిక్ష ఖరారైతే ఆ విద్యార్థి మరే ఇతర విద్యా సంస్థలో ప్రవేశం పొందలేడని సీపీ హెచ్చరించారు.

గోల్కొండ కోటలో డీజీపీ పర్యటన

గోల్కొండ: గోల్కొండ కోటలో జరిగే పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఓ వైపు పతాకావిష్కరణ వేదిక, వీఐపీల గ్యాలరీ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మరోవైపు పోలీస్ పరేడ్ రిహార్సల్స్ జోరందుకున్నాయి. మంగళవారం డీజీపీ డాక్టర్ జితేందర్ వివిధ శాఖల అధికారులతో కలిసి కోటలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా ఆయన పతాకావిష్కరణ జరిగే వేదికను పరిశీలించారు. ముఖ్యమంత్రి కోటలోకి ప్రవేశించగానే తీసుకునే ప్రొటోకాల్ విషయంపై కూడా ఆయన అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఏర్పాట్లలో పొరపాట్లు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వేదిక వరకు ముఖ్యమంత్రి వచ్చే మార్గంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రి కోసం ఏర్పాటు చేసిన రెస్ట్ రూమ్‌ను సైతం ఆయన పరిశీలించారు.



పతాకావిష్కరణ వేదికను పరిశీలిస్తున్న డీజీపీ జితేందర్ తదితరులు

ఆ ప్రతిపాదన విరమించుకోవాలి

- మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వొద్దు
- యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించి, మండల విద్యా వనరుల కేంద్రంలోని అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 54,202 మంది మధ్యాహ్న భోజన కార్మికులు 24 ఏళ్లుగా కష్టనష్టాలను భరిస్తూ పనిచేస్తున్నారని అన్నారు. అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన మహిళలే ఉన్నారని.. అలాంటి వారి ఉపాధిని పరిగణలోకి తీసుకోకుండా ఈ పథకాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చేందుకు నిర్ణయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మికులకు సకాలంలో బిల్లులు రాకపోయినా అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండి పెడుతూ ఆర్థిక ఇబ్బందులను సైతం భరిస్తున్నారని తెలిపారు. కార్మికుల వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎన్నికలకు ముందు మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి, ఇప్పుడు వారి పొట్టలు కొట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో 21న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీ యూ జిల్లా నాయకులు ఎల్లేష్, బుగ్గరాములు, తులసిగారి నర్సింహ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సమస్యలు పరిష్కరించాలి

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్నందుకు గాను వంట సిబ్బంది అప్పులపాలవుతున్నారని మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు వై.స్వప్న ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన సిబ్బందికి పెండింగ్ బిల్లులు చెల్లించాలని, మధ్యాహ్న భోజనం వండే బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దని డిమాండ్ చేస్తూ మంగళవారం యాచారం తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చందునాయక్, ఎల్లేష్, చంద్రకళ, మల్లారి, పద్మ, యాదమ్మ, కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళపై లైంగిక దాడి

శంకర్‌పల్లి: ఓ ఒంటరి మహిళపై అత్యాచారం జరిగిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్ తెలిపిన ప్రకారం.. ఓ కాలనీకి చెందిన ఒంటరి మహిళ(23) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కొన్నేళ్ల క్రితం ఆమె భర్త చనిపోయాడు. అదే కాలనీకి చెందిన ఈ.రవి(35) అనే వ్యక్తి ఆదివారం మద్యం సేవించాడు. మద్యం మత్తులో ఆ మహిళతో గొడవపడి అనంతరం ఆమెని బలవంతంగా తన బిల్డింగ్ మీదకి తీసుకుని వెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధిత మహిళ సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకోని విచారించగా.. అతనిపై గతంలోనూ పలు కేసులు ఉన్నట్లు గుర్తించామని సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



అబ్దుల్లాపూర్‌మెట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలం కేంద్రంలోని ఎస్ఆర్ హాస్టల్ సమీపంలో ఓ గుర్తు తెలియని (సుమారు 55–60 ఏళ్ల మధ్య ఉన్న) వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్న సమాచారం అందింది. మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

తొలిదశలో గుర్తిస్తే కేన్సర్‌కు అడ్డుకట్ట

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

కొందుర్గు: కేన్సర్ వ్యాధిని తొలిదశలోనే గుర్తిస్తే రోగులను కాపాడుకోవచ్చునని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం డాక్టర్ అమ్రిత జోసెఫ్ ఆధ్వర్యంలో కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత కేన్సర్ పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. కేన్సర్ వ్యాధి తొలిదశలో ఉంటే సరైన పోషకాహారం తీసుకుని వ్యాయామం చేయడం, వైద్యుల సలహామేరకు మందులు వాడితే వ్యాధి నుంచి బయటపడొచ్చన్నారు. ప్రజలను వ్యాధి నుంచి రక్షించేందుకు ప్రభుత్వమే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో పది రకాల పరీక్షలు చేస్తారని.. అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మండల వైద్యాధికారి డాక్టర్ అమ్రిత జోసెఫ్ మాట్లాడుతూ.. 142 మంది పరీక్షలు చేయించుకున్నారని వీరిలో 32 మందికి హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రిలో మరిన్ని పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నిఖిత, హరికిషన్, రాఘవేందర్, సీహెచ్‌ఓ మంజుల, పీహెచ్‌ఎన్‌ఓ లుదియా, ఎంపీహెచ్‌ఈఓ మున్వర్ హుస్సేన్, శ్రీనివాస్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

శంకర్‌పల్లి: 35 ఏళ్లు నిండిన వారంతా క్రమం తప్పకుండా ప్రతీ సంవత్సరం కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దామోదర్ అన్నారు. మంగళవారం ఇండియన్ కేన్సర్ సొసైటీ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. 140 మంది పరీక్షలు చేయించుకోగా 20 మందికి గర్భాశయ, ఐదుగురికి నోటి, ఒకరికి రొమ్ము కేన్సర్ లక్షణాలున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. పూర్తి స్థాయి పరీక్షల అనంతరం.. స్పష్టత వస్తుందని వైద్యులు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ధూమపానానికి, గుట్కాలకి దూరంగా ఉండాలన్నారు. శంకర్‌పల్లిలో 26మందికి పలు రకాల క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని, వారికి త్వరలోనే ఇండియన్ క్యాన్సర్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు.



శంకర్‌పల్లి: ఇండియన్ కేన్సర్ సొసైటీ బృందంతో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, శంకర్‌పల్లి వైద్య బృందం



కొందుర్గు: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ కేన్సర్ డైరెక్టర్ రాకేశ్, శంకర్‌పల్లి, టంగటూర్ పీహెచ్‌సీ వైద్యాధికారులు రేవతిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన నక్కర్తమేడిపల్లి

- గ్యాంగ్‌స్టర్ హత్యలో పాల్గొన్న సుపారీ గ్యాంగ్ తలదాచుకున్నట్లు సమాచారం
- గ్రామాన్ని చుట్టుముట్టిన పోలీసులు
- సాయంత్రం 4గంటల వరకు విచారణ

యాచారం: నక్కర్తమేడిపల్లి గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గ్యాంగ్‌స్టర్‌ను హత్య చేసిన నిందితులు గ్రామంలో తలదాచుకున్నారనే విషయం తెలియడంతో గ్రామస్తులంతా భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. కొద్ది రోజుల క్రితం బాలాపూర్‌లో గ్యాంగ్‌స్టర్ రియాజ్ హత్యలో పాల్గొన్న నిందితులు గ్రామంలోని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఓ ఇంట్లో తలదాచుకుంటున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో మంగళవారం ఉదయం రాచకొండ స్పెషల్ పార్టీ పోలీస్ బృందం ఆ ఇంటిని చుట్టుముట్టి కొందరిని అదుపులోకి తీసుకుని ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటలవరకు విచారించింది. విచారణ సమయంలో ఆ ఇంటి పరిసరాల్లోకి గ్రామస్తులను అనుమతించలేదు. గ్యాంగ్‌స్టార్ రియాజ్ హత్యకు ముందు సుపారీ గ్యాంగ్ నక్కర్తమేడిపల్లి గ్రామంలో తలదాచుకున్నారా..? లేదా హత్య తర్వాత వచ్చి షెల్టర్ తీసుకున్నారా.? అని గ్రామంలో చర్చలు కొనసాగుతున్నాయి. ఒక్కసారిగా పోలీసు బలగాలు గ్రామంలోకి రావడం.. కొంతమందిని అదుపులోకి తీసుకోవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఇదే విషయమై హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ నర్సింహారావును 'సాక్షి'ఫోనులో సంప్రదించగా బాలపూర్‌లో జరిగిన ఓ హత్య విషయమై స్పెషల్ పార్టీ పోలీసులు విచారణ చేసినట్లు తెలిసిందన్నారు.



నక్కర్తమేడిపల్లిలో యువకులను విచారణ చేసిన ఇల్లు

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

మణికొండ: మున్సిపాలిటీ 16వ వార్డు మణికొండ క్వార్టర్స్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం కౌన్సిలర్ పి.శైలజవినోద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచటంతో పాటు, పిల్లలకు దోమలు కరవకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీల్లో చదువుకుంటున్న చిన్నారులకు పౌష్టికారం అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలపై ఉందని, అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను మున్సిపాలిటీ నుంచి కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కౌన్సిలర్ శైలజ

బంగ్లాదేశ్‌లో హిందువులకు భద్రత కల్పించండి

- వీహెచ్‌పీ రాష్ట్ర నాయకుడు రమేశ్

షాద్‌నగర్‌రూరల్: బంగ్లాదేశ్‌లో హింసాకాండ జరుగుతున్న నేపథ్యంలో అక్కడి హిందువులకు భద్రత కల్పించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకుడు బండారి రమేష్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులు, సిక్కులు, ఇతర మైనార్టీలకు చెందిన వ్యాపార సంస్థలు, ఇళ్లు దాడికి గురయ్యాయన్నారు. బంగ్లాదేశ్‌లో హిందూ ఆలయాలు, గురుద్వారాలు దుకాణాలు, హిందూ శ్మశాన వాటికలు ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు 32శాతం ఉన్న హిందువులు నేడు 8 శాతానికి తక్కువగా ఉన్నారంటే ఆ దేశంలో హిందువులపై జరుగుతున్న హింసాకాండ ఏ విధంగా ఉందో అర్థమవుతుందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌లోని హిందువుల భద్రతకు, మానవ హక్కుల పరిరక్షణ కోసం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసాకాండను నిరసిస్తూ బుధవారం ఉదయం 10గంటలకు పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు నిరసన ర్యాలీని చేపడుతున్నామన్నారు. ఈ ర్యాలీకి పరిసర ప్రాంతాల్లో హిందువులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.



నాలుగేళ్ల క్రితం హత్య

ముగ్గురికి జీవిత ఖైదు, జరిమానా విధించిన కోర్టు

కేశంపేట: నాలుగేళ్ల క్రితం జరిగిన హత్య కేసు నిందితులకు జీవితకాలం జైలు శిక్షతోపాటుగా జరిమానా విధిస్తూ మంగళవారం న్యాయమూర్తి హరీష తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామానికి చెందిన మృతుడు జిన్నారం జంగయ్య(38), శివకుమార్, గణేశ్ మిత్రులు. జంగయ్య భార్య జంగమ్మతో శివకుమార్‌కు అక్రమ సంబంధం ఏర్పడింది. ఈ విషయం భర్తకు తెలియడంతో భార్యతో పలుమార్లు గొడవపడ్డాడు. విషయం మనుసులో పెట్టుకున్న శివకుమార్ స్నేహితుడు గణేశ్‌తో కలిసి 2020 ఆగస్టు 23న జంగయ్యకు కేశంపేట వైన్స్ వద్ద మద్యం తాగించి చింతకుంటపల్లి శివారులోకి తీసుకెళ్లి తలపై దాడి చేసి చంపేశారు. ఇదే విషయం 2020పై ఆగస్టు 24న చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. షాద్‌నగర్ రూరల్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ కోన వెంకటేశ్వర్లు పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి కోర్టుకు సమర్పించారు. జిల్లా 9వ అడిషనల్ కోర్టులో నేరం రుజువ్వవడంతో న్యాయమూర్తి హరీష ముగ్గురుకి జీవితకాల జైలు శిక్షతో పాటుగా శివకుమార్‌కు రూ.30వేలు, గణేశ్, జంగమ్మలకు రూ.20వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసును న్యాయవాది రఘు వాదించినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

మైనర్ బాలికను గర్భవతి చేసి.. ఆపై అబార్షన్

శంషాబాద్: మైనర్ బాలికను గర్భవతి చేయడంతో పాటు అబార్షన్ చేయించిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎర్రకుంట తండాకు చెందిన గిరిజన మహిళతో పాటు ఆమె కూతురు (15) జూకల్ గ్రామానికి చెందిన మన్నె కృష్ణారెడ్డి (35) పొలంలో కొంతకాలంగా కూలీ పనులు చేస్తున్నారు. కొంతకాలంగా సదరు బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకన్న యజమాని పొలం పక్కనే ఉన్న గదిలో పలుమార్లు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక గర్భవతి అని తెలియడంతో కొత్తూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మంగళవారం అబార్షన్ చేయించాడు. విషయం తెలిసిన బాలిక తల్లి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్డి సేవాసమితి అధ్యక్షుడిగా మునగాల

శంషాబాద్: శంషాబాద్ రెడ్డి సేవా సమితి అధ్యక్షుడిగా ఎయిర్‌పోర్టు కాలనీకి చెందిన మునగాల సుధాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జరిగిన రెడ్డి సేవా సమితి కార్యవర్గ నియామక కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్డి సేవా సమితిని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని మునగాల సుధాకర్‌రెడ్డి అన్నారు.

అదనపు అంతస్తులు నిర్మించొద్దు



భాగ్యలక్ష్మికాలనీలో కూల్చిన అదనపు అంతస్తు స్లాబ్



పెంట్‌హౌస్, అంతస్తు స్లాబ్‌లను కూల్చిన సిబ్బంది

మణికొండ: భాగ్యలక్ష్మి కాలనీలో అదనపు అంతస్తులు నిర్మించిన రెండు భవనాల పై అంతస్తులను మంగళవారం టీపీఓ సంతోష్‌సింగ్ కూల్చివేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో తీసుకున్న అనుమతుల మేరకు మాత్రమే నిర్మాణాలను చేసుకోవాలని, లేదంటే కూల్చివేతలు తప్పవని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులను జారీ చేస్తున్న వాటిపై కొందరు అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారని, అలాంటి వాటిని ఎట్టి పరిస్థితిలో సహించే ప్రసక్తేలేదన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి భవనాలను హైడ్రా పూర్తి స్థాయిలో కూల్చివేసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాకిస్తాన్ నుంచి ఫోన్ కాల్ బెదిరింపులు

మైలార్‌దేవ్‌పల్లి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసినందున తనను పాకిస్తాన్ నుంచి వాట్సాప్ కాల్ చేసి బెదిరిస్తున్నారని బీజేపీ యువమోర్చా మాజీ కార్యదర్శి బొక్క బాల్‌రెడ్డి సోమవారం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ..బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఈ నెల 11న తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశానని, ఇందులో ఎవరికి వ్యతిరేకంగా పోస్టు చేయలేదని తెలిపాడు. 12,13 తేదీల్లో గుర్తుతెలియని నంబర్లతో వాట్సాప్ కాల్ చేసి బెదిరిస్తున్నారని, తనను అంతం చేస్తామని హెచ్చరిస్తున్నారన్నాడు. దీనిపై తాను రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరేయాలి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల చౌరస్తా నుంచి మర్రిచెట్టు సర్కిల్ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రతి ఇంటిపై జెండాను ఎగరవేసి తమ దేశ భక్తిని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు సి. బీరప్ప, జిల్లా బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి అనిత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇందిర, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.సిద్దప్ప, కౌన్సిలర్‌లు శ్వేతరవికాంత్‌రెడ్డి, వందనగేష్, కోఆప్షన్ సభ్యురాలు జె.లక్ష్మీరాములు, నాయకులు వీణ, లతా, భువనేశ్వరి, గౌరీ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలో స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఇంటింటికి జాతీయ జెండాలను కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 5న ప్రతి ఇంటిపై జెండాను ఆవిష్కరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బండి నోరోత్తం రెడ్డి, భవానిదాస్, నరసింహా, వెంకటరమణ, మధుసూధన్ రెడ్డి పాల్గొన్నారు.



జెండాలు పంపిణీ చేస్తున్న డివిజన్ కార్పొరేటర్

డేంజర్ స్పీడ్!

రాజధానిలో అతివేగం వల్లే అనేక ప్రమాదాలు

- నగర రోడ్లు గంటకు 50 కిమీ వరకే ఉపయుక్తం
- '65' దాటితే ప్రమాదాలు కొనితెచ్చుకున్నట్లే
- ఇటీవల అనేక మందిని బలితీసుకున్న ఓవర్ స్పీడ్



సాక్షి, సిటీబ్యూరో: 'స్పీడ్ థ్రిల్స్ బట్ కిల్స్' ఇది ముమ్మాటికీ నిజమని ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు స్పష్టం చేస్తున్నాయి. సోమవారం వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఐదుగురు చనిపోగా... వీరిలో నలుగురిని పొట్టన పెట్టుకుంది అతివేగమే. ఇవే కాదు.. నగరంలో జరుగుతున్న రోడ్ యాక్సిడెంట్స్‌లో అత్యధికం అతి వేగం కారణంగానే జరుగుతున్నాయని పోలీసులే అంగీకరిస్తున్నారు. సిటీ రహదారులు గరిష్టంగా గంటకు 50 కిమీ వేగంతో ప్రయాణించడానికి మాత్రమే అనువని రవాణా రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గంటకు 65 కిమీ వేగం దాటితే ప్రమాదాలను కొని తెచ్చుకున్నట్లే అని వివరిస్తున్నారు. ఓ వాహన వేగం పెరిగే కొద్దీ... దాని డ్రైవర్ కన్ను చూడగలిగే ప్రాంతం వెడల్పు తగ్గుతుందని అధికారులు వివరిస్తున్నారు.

దేని దారి దానిదే...

రాజధానిలో వాహనాల సరాసరి వేగం గంటకు 25 కిమీ మించట్లేదు. రహదారులు పరిస్థితి, ఇబ్బడిముబ్బడిగా వచ్చి పడుతున్న కొత్త వాహనాలు, ఆక్రమణల సహా మరెన్నో దీనికి కారణంగా మారుతున్నాయి. మరోపక్క సిటీ రహదారులు గంటకు గరిష్టంగా 50 కిమీ వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేసినవి. అయితే నగర రోడ్ల పైకి కొత్తగా వస్తున్న, ఇప్పటికే ఉన్న వాహనాల గరిష్ట వేగం గంటకు 200 కిమీ పైగా ఉంటోంది. రహదారులు స్థితిగతులు, వాహనాల గరిష్ట వేగం మధ్య ఎలాంటి పొంతన లేకపోయినప్పటికీ వీటిని నియంత్రించే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక చట్టం, నియమ నిబంధనలు లేవని పేర్కొంటున్నారు.

పరిమిత వేగం పాదచారులకూ రక్షణే...

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా బాధితులుగా మారుతున్నది పాదచారులే. ఫుట్‌పాత్‌లు, క్రాసింగ్స్ సహా ఎలాంటి సౌకర్యాలు సిటీలో అవసరమైన స్థాయిలో ఉండవు. ఫలితంగా రోడ్డు దాటుతున్న, రహదారులపై నడుస్తున్న బాటసారులు వాహనాల వద్ద ప్రమాదాల బారి నపడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) అధ్యయనం ప్రకారం వాహన వేగం 5 శాతం తగ్గినప్పుడు ప్రమాదాలబారి పడే ఆస్కారం 30 శాతం తగ్గుతుంది. గంటకు 50 కిమీ వేగంతో ప్రయాణించే వాహనం ఓ పాదచారుడిని ఢీ కొట్టినా... అతడికి మరణం సంభవించే ప్రమాదం 30 శాతం తక్కువగా ఉంటుంది. వాహన వేగం గంటకు 80 కిమీ మించితే ఎదుటి వ్యక్తికి మరణం సంభవించే అవకాశం 60 శాతం పెరిగినట్లేనని డబ్ల్యూహెచ్‌ఓ అభిప్రాయపడింది.

'విజన్', రెస్పాన్స్ టైమ్ కీలకం..

వాహనాన్ని నడిపే ప్రతి డ్రైవర్ తన ఎదురుగా ఉన్న ప్రాంతంలో ఎన్ని డిగ్రీల కోణం వరకు చూడగలడన్నది కీలకం. దీన్ని బట్టే ప్రమాదాలు జరిగే తీరుతెన్నులు ఆధారపడి ఉంటాయి. వేగం పెరిగే కొద్దీ డ్రైవర్ దృష్టి సారించగల ప్రాంతం వెడల్పు తగ్గుతుంది. ఇదే ప్రమాదాలకు హేతువుగా మారుతోంది. అలాగే వాహనచోదకులు తన ముందు ముప్పు కనిపించినప్పుడు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడానికి కొంత సమయం పడుతుంది. దీన్నే సాంకేతికంగా రెస్పాన్స్ టైమ్ అంటారు. ఎదుట ఉన్న ముప్పును మెదడు గుర్తించి, తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేయడానికి పట్టే సమయమిది. వేగం ఎక్కువైతే ఈ రెస్పాన్స్ టైమ్ కూడా ప్రమాదహేతువే. మద్యం మత్తులో ఉన్న వారికి ఈ టైమ్ చాలా ఎక్కువగా ఉంటుంది.

ఎయిర్ బెలూన్లకూ కొంత సమయం..

దాదాపు అన్ని కార్లలోనూ ఎయిర్‌బెలూన్లు ఉంటున్నాయి. ప్రమాదం చోటు చేసుకున్నప్పుడు యాక్టివేట్ అయ్యే సెన్సర్లు వీటిని తెరుచునేలా చేస్తాయి. ప్రమాదం జరిగాక సెన్సర్ యాక్టివేట్ అయినప్పటి నుంచి ఎయిర్ బ్యాగ్ తెరుచుకోవడానికి మధ్య సెకన్ల సమయం ఉంటుంది. వాహన వేగం మితిమీరి ఉంటే... ఈ సమయం లోపే డ్రైవర్ లేదా ప్రయాణికులు స్టీరింగ్, డ్యాష్‌బోర్డ్, సీట్లకు కొట్టుకునే అవకాశం ఉంటుంది. కొన్నిసార్లు ఎయిర్ బ్యాగ్స్ పేలిపోవడం కూడా జరుగుతుంది. ఈ పరిస్థితుల్లోనే ఎయిర్ బ్యాగ్స్ కూడా వాహనంలోని వారిని రక్షణ ఉండదు.

రాత్రి వేళల్లోనే జోష్...

వాహనాల రద్దీ, ట్రాఫిక్ పోలీసుల నిఘా తదితర కారణాల నేపథ్యంలో పగటి పూట సిటీ రహదారులపై మితిమీరిన వేగానికి ఆస్కారం లేదు. కొన్ని రోడ్లలో వేగంగా వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ... జంక్షన్లతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉండే సిగ్నల్స్ కారణంగా దీనికి బ్రేక్ తప్పట్లేదు. కేవలం ఇన్నర్ రింగ్ రోడ్, శివారు రహదారులు వంటి కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వాహనాలు పగటిపూట వేగంగా, ఎలాంటి బ్రేక్ లేకుండా ప్రయాణించే ఆస్కారం ఉంది. అయితే రాత్రి వేళల్లో రోడ్లన్నీ దాదాపు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఫలితంగా వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణించడంతో పాటు రేసింగ్స్ వంటివి జరుగుతున్నాయి.